## క్లుప్తంగా

### ముస్లింలకు నిత్యావసరాల కిట్ల పంపిణీ



ముస్లింలకు కిట్లు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు తదితరులు

**కడియం:** దుళ్ల గ్రామంలోని 30 ముస్లిం కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కంటిపూడి కిరణ్ కుమార్ ఆదివారం నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా స్థానిక మసీదులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ మాట్లాడుతూ మూడేళ్లుగా రంజాన్‌ను పురస్కరించుకుని కిరణ్ కుమార్ కిట్లను పంపిణీ చేస్తున్నారన్నారు. ఆయన హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ గ్రామంలో పలు సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పలువురికి స్ఫూర్తినిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈదర నందేశ్వరరావు, స్థానిక నాయకులు చిట్టూరి వెంకన్న చౌదరి, మసీదు అధ్యక్షుడు షేక్ సత్తార్, ఉపాధ్యక్షుడు షేక్ మీరయ్య, నాయకులు షేక్ సిద్దా మీరయ్య, షేక్ మీరా సాహెబ్, షేక్ సుభాన్, మాబు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, ఏడిద బాబీ

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** సినీ నటుడు రామ్ చరణ్ జన్మదిన వేడుకలలో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక జక్కంపూడి బ్లడ్ బ్యాంక్‌లో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ – జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రక్తదాతలకు అభినందనలు తెలియజేసి, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిబిరంలో సుమారు 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వానపల్లి అంజి, దొడ్డి జానీ, టజు బాబా, విజ్జన శివ, వర్రే రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

### ఉచిత విద్య దరఖాస్తులకు గడువు పెంపు

**రంగంపేట:** ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు మండల విద్యాశాఖాధికారి-1 కోసు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి గాను అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల్లోని పేద పిల్లలకు కేటాయించాలని విద్యాశాఖ నుంచి గతంలోనే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మొదట మార్చి 14 వరకూ మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇవ్వగా తాజాగా సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఈ గడువును ఈ నెల 31 వరకూ పొడిగించారన్నారు.

### వైద్య శిబిరం

**సీతానగరం:** సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుధామయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, రఘుదేవపురానికి చెందిన శ్రీమామయ్య హాస్పటల్ అధినేత డాక్టర్ సత్యం రమేష్‌బాబు శిబిరంలో వైద్యసేవలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోషకాహారం, సరైన నిద్ర, వ్యాయామం, విద్య ఆదాయం, సరైన జీవన విధానాల గురించి అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ, కామర్స్ అధ్యాపకుడు షేక్ దర్గా మదీనా తదితరులు మాట్లాడారు. అనంతరం డాక్టర్లు రాజు, సత్యం రమేష్‌బాబు, హెల్త్ సూపర్ వైజర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, కామర్స్ లెక్చరర్ మదీనాలను సన్మానించారు.

### భక్తులకు భోజన వసతి

**మధురపూడి:** కోరుకొండలోని విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం దాతృత్వానికి చిరునామాగా నిలిచిందని ఈఓ పాటి సత్యనారాయణ తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా ఐదు రోజులూ భక్తులకు మధ్యాహ్నం, రాత్రి భోజనం వితరణ చేస్తున్నామన్నారు. కోటికేశవరానికి చెందిన విరియాల వెంకటరెడ్డి 1918లో దీనిని నెలకొల్పారు. ఈ సత్రానికి ప్రస్తుతం 123.56 ఎకరాలు స్థిరాస్తి ఉంది.

### ఓటు విలువ గుర్తించాలి

**బిక్కవోలు:** భారత పౌరులంతా ఓటు విలువను గుర్తించి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఆర్‌ఐ నందకిషోర్ సూచించారు. శనివారం స్థానిక నెహ్రూ కేంద్రం ఆధ్వర్యంలో బిక్కవోలు ప్రజ్ఞ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నందకిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు.

# అత్యద్భుతం.. వెలుగుల వనం..



గ్లో గార్డెన్ పార్కులో సందర్శకులు

- ఆకట్టుకుంటున్న గ్లో గార్డెన్
- రూ. 4.4 కోట్లతో నిర్మాణం
- తరలివస్తున్న సందర్శకులు

**రాజమహేంద్రవరం సిటీ:** నగరంలో రాత్రి అయిదంటే చాలు అద్భుతమైన అందాల హరివిల్లు ఆవిష్కృతమవుతోంది. అడుగు తీసి అడుగు వేస్తే లైటింగ్ వెలిగేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారులు, యువత, అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా లాలా చెరువు సమీపంలోని 50వ డివిజన్ గాంధీపురం – 4 మున్సిపల్ పార్కులో గ్లో గార్డెన్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గ్లో గార్డెన్ ప్రజలను ఎంతో ఆకట్టుకుంటోంది.

**రూ.4.4 కోట్లతో నిర్మాణం**


ఈ పార్కులో అద్భుతమైన టెక్నాలజీతో, మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో, కళాకాంతులతో ఏర్పాటు చేసిన రంగురంగుల దీపాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సుమారు రూ.4.4 కోట్లతో దీని నిర్మాణం చేపట్టారు. ఇలాంటి పార్కులు గుజరాత్‌లో ఒకటి, తెలంగాణలో రెండోది, రాజమహేంద్రవరంలో మూడోది ఏర్పాటు చేశారు. రాత్రి 6.30 గంటల నుంచి 10 గంటల ప్రజలు సందర్శించవచ్చు. పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 ప్రవేశ రుసుంగా నిర్ణయించారు.

**వివిధ ఆకారాల్లో..**

ఈ గార్డెన్‌లో పలు రకాల జంతువుల ఆకారాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జింకలు, ఎలుగుబంట్లు, జిరాఫీలు, జీబ్రాలు, హంసలు, ఫ్లెమింగోలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులు




గ్లో గార్డెన్ పార్కు



ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలు

కూర్చునేందుకు ప్రత్యేక లైటింగ్‌తో సిట్టింగ్ కూడా ఉంది. వెదురు పొదలు, చెర్రీ ట్రీస్, పామ్ ట్రీస్ అద్భుతంగా ఉన్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు సంగీతం, లైటింగ్‌తో వచ్చే పియానో కూడా ఉన్నాయి. దీంతో పాటు 32 డిస్క్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రత్యేకత ఏమిటంటే సందర్శకులు నడుస్తున్న సమయంలో లైటింగ్ వస్తుంది. గార్డెన్ అంతా నియాన్ లైట్ల వెలుగులతో నింపి వేశారు. విద్యుత్ దీపాలతో వెలిగే విధంగా పెద్ద చెట్లు, గ్రాస్ (గడ్డి) ఏర్పాటు చేశారు.



జింకలు, హంసలు

### ప్రత్యేక ఆకర్షణ



గ్లో గార్డెన్‌ను మన రాష్ట్రంలో ఎక్కడా చూడలేదు. మెట్రో నగరాలలో సైతం కనిపించలేదు. ఇది రాజమహేంద్రవరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పార్కులో ఏర్పాటు చేసిన ఆకృతులు చాలా బాగున్నాయి.

– వలవల సుబ్రహ్మణ్యం, వైద్య విద్యార్థి, రాజమహేంద్రవరం

### గర్వకారణం



గ్లో గార్డెన్ చాలా అద్భుతంగా ఉంది. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయడంతో మనకు గర్వకారణం. జిల్లాకే ఈ పార్కు అందాన్ని తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి, నగరపాలక సంస్థ అధికారులకు కృతజ్ఞతలు.

– బైరెడ్డి యామిని

# ముస్లింల సంక్షేమానికి కృషి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

**రాజమహేంద్రవరం సిటీ:** ముస్లింలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తాడితోట నూర్ మసీదులో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాసంలో మీరు చూపే త్యాగం, సహనం, దానం, ప్రేమ.. లోక కల్యాణానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దివంగత వైఎస్సార్‌కు ముస్లింలంటే ఎంతో ఇష్టమని, అదే విధంగా ముఖ్యమంత్రి జగనన్న ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలను, ఆర్థిక సహకారాన్ని అందించారన్నారు. విజయవాడ నుంచి మక్కా వెళ్లేందుకు విమాన చార్జీల అదనపు భారాన్ని జగనన్న చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. నగరంలో ముస్లింల షాదీ ఖానా కోసం రూ.36 కోట్లు విలువజేసే 1800 గజాల స్థలాన్ని సమకూర్చామన్నారు. ఆ షాదీఖానాకు తన ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు ప్రకటించానన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద షాదీఖానాను నగరంలో నిర్మించబోతున్నట్టు తెలిపారు.

# నగరంలో ఆదిరెడ్డి వాసు అరాచకాలు



భరత్‌రామ్, ఎంపీ

**రాజమహేంద్రవరం సిటీ:** నగరంలో వ్యాపారులకు ఇబ్బంది కలిగేలా కార్పొరేషన్ అధికారులతో కలిసి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అరాచకాలు చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేవీచౌక్, దానవాయిపేట, ఏకేసీ కళాశాల, ఆదిత్య కళాశాల, వీటీ కళాశాల రోడ్లలో దుకాణాల ముందు ఉన్న మెట్లు, శ్లాబ్‌లను నాలుగు రోజులుగా తొలగిస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇది ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం చేస్తున్న రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. నాలుగున్నరేళ్లుగా ఎప్పుడూ లేని ఈ పనిని ఇప్పుడు ఎందుకు మున్సిపల్ అధికారులు చేయిస్తున్నారో వ్యాపారులు, వ్యాపార సంస్థ నిర్వాహకులు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. ఆదిరెడ్డి వీరరాఘవమ్మ మేయర్‌గా ఉన్నప్పట్నుంచీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు అధికారులు పాతుకుపోయి ఉన్నారన్నారు. వారి ఆధ్వర్యంలో ఆదిరెడ్డి కుటుంబం ఈ పనులు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎంపీగా ఉన్న తనపై తప్పుడు ప్రచారం, బురద జల్లేందుకు ఇప్పుడు ఇటువంటి కూల్చివేత కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. ఈ కుట్రలను వ్యాపారులు గ్రహించాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఇటువంటి చర్యలు చేపట్టడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళతానన్నారు. వ్యాపారులకు నష్టం కలిగించే విధంగా ఎటువంటి చర్యలూ ఎంపీగా ఎప్పుడూ తీసుకోలేదని, భవిష్యత్తులో కూడా తీసుకోనని ఎంపీ భరత్ రామ్ స్పష్టం చేశారు.

### వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

**మధురపూడి:** కోరుకొండ అగ్రహారంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం సమీపంలోని ఈ ఆలయానికి భక్తుల రద్దీ ఏర్పడింది. నరసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజు బట్టర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తొలుత గోదాదేవి, రంగనాథస్వామికి మంగళస్నానాలు చేయించారు. పట్టువస్త్రాలను అలంకరించి కల్యాణ మహోత్సవం జరిపారు. పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు, పెద్దింటి చంటిబాబు, పెదపాటి నరసింహ గిరిధర్, గోవర్ధనం తిరుమలాచార్యులు చేతుల మీదుగా కల్యాణం జరిగింది. పెదపాటి, పెద్దింటి, పెరవలి కుటుంబాలకు చెందిన అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

### నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**మధురపూడి:** కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు శనివారం వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరవుతారన్నారు.

### ముగిసిన ఏడు వారాల వ్రతాలు

**పెదపూడి:** సంపర వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మాఘమాసంలో ప్రారంభమైన ఏడు శనివారాల వ్రతం పూజలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

# ఘనంగా సోమాలమ్మ జాతర



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

**ప్రకాశం నగర్:** శ్యామల నగర్ పుంత రోడ్డులోని పాత సోమాలమ్మ జాతరలో భాగంగా అమ్మవారిని శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త గొర్రేల సురేష్, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈనెల 20న ప్రారంభమైన జాతర ఆదివారం (24వ తేదీ) ముగుస్తుంది. ఆఖరి రోజు భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. కార్యక్రమంలో అడపా అనిల్, ఆలయ ధర్మకర్త గొర్రేల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం



విప్లవ వీరుల చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు



కడియంలో భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వసంతరావు తదితరులు

**ప్రకాశం నగర్:** భగత్ సింగ్ పోరాటం యువతకు ఆదర్శమని పలువురు వ్యక్తులు కొనియాడారు. విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని శనివారం నగరంలో పలుచోట్ల నిర్వహించారు. సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద భగత్ సింగ్ విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ భగత్ సింగ్ చరిత్రను నేటి యువత అధ్యయనం చేసి, వారి ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్, ఏవైఎఫ్ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజా సంఘాల నాయకుల ప్రతిజ్ఞ**

భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఐదుబల్ల మార్కెట్ సెంటర్ వద్ద ప్రజా సంఘాల నాయకులు టి.అరుణ్, కె.రామకృష్ణ, బి.రాజులోవ, బి.పవన్, పి.తులసి తదితరులు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్య హక్కులు, అభివృద్ధి, స్వేచ్ఛ, ప్రజలను ఐక్యతను కాపాడామని ప్రతిజ్ఞ చేశారు. పి.వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, ఉమా, సుబ్రహ్మణ్యం, తాతారావు రాంబాబు పాల్గొన్నారు.

**పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..**

పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు లంక సత్యనారాయణ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గువ్వల వెంకటేశ్వరరావు, చల్లగాలి వెంకట రామరాజు, సిరికి అక్కు నాయుడు, నరవ గోపాలకృష్ణ, కేఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

**కడియంలో..**

**కడియం:** దేశ స్వాతంత్ర్య కోసం భగత్ సింగ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని సీనియర్ అడ్వకేట్ తోరాటి వసంతరావు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక దేవీచౌక్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, కళ్యాణపు సూరిబాబు, తమ్మిశెట్టి ప్రసాద్, చిలుకూరి నాగేశ్వరరావు, పల్లా వెంకటగిరి, నందం వీరబాబు, చల్లా అంజిబాబు పాల్గొన్నారు.

# జగన్ సంక్షేమ పాలనకు మద్దతు పలకండి

- సీలింగ్ ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యండి
- రామచంద్రపురంలో డాక్టర్ రాజశ్రీ ఎన్నికల ప్రచారం



రామచంద్రపురంలో ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

**సీతానగరం:** రానున్న ఎన్నికలలో సీలింగ్ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, సంక్షేమ పాలనకు మద్దతు పలకాలని ప్రజలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ కోరారు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైస్ ఎంపీపీ -2 సత్యం మదన్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ప్రజలందరి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. రాజానగరాన్ని నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బొట్టు పెట్టి వారితో మమేకమవుతూ ముందుకు సాగారు. రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే మేలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు, జొన్నలగడ్డ గంగరాజు, ఉండవల్లి ప్రభాకరరావు, తీగిరెడ్డి రామకృష్ణ, గురజా రవి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పెందుర్తి భారతి, ఉండవల్లి యశోదారాణి, అట్రు పద్మావతి, జొన్నలగడ్డ లక్ష్మి, మారిన స్వాతి, గారపాటి గంగాభవానీ, రంధి భారతీదేవి పాల్గొన్నారు.

# పశు పెంపకంపై యువతకు శిక్షణ

**రాజానగరం:** పశువులను ఆరోగ్యంగా, సురక్షితంగా చూసుకుంటే పాల ఉత్పత్తి కూడా ఎంతో వృద్ధి చెందుతుందని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ఎంపిక చేసిన గ్రామీణ యువతకు పశు పోషణ, యాజమాన్య నైపుణ్యాలు, పశువులకు సోకే రోగాలకు ప్రాథమికంగా చేపట్టాల్సిన చికిత్సలపై కేవీకేలో వారం రోజులు నిర్వహించే శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ పశు పోషణకు అవసరమైన పశుగ్రాసం, దాని వల్ల చేకూరే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధిని చూపేందుకు కేవీకే చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కేవీకే విశ్రాంత పశువైద్యాధికారులు డాక్టర్ జాన్‌బాబు, డాక్టర్ పీవీవీఎస్ శివరావు మాట్లాడుతూ పశువులకు అందించే ప్రథమ చికిత్స, టీకాలు, వాటి వలన పశువులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పశువులలో రోగనిరోధక శక్తిని ఏ విధంగా పెంచాలో తెలియజేశారు. అనంతరం కేకేవీలోని పొట్టి మేకలు, కోళ్ల పెంపకం యూనిట్లను, పశుగ్రాసం క్షేత్రాలను శిక్షణకు హాజరైన యువత సందర్శించింది. కార్యక్రమంలో టి.విజయవర్ధన్, జె.ప్రభాత్ నాయుడు పాల్గొన్నారు.



పొట్టి మేకల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే అధికారులు

### నిత్యావసరాల వితరణ

**ప్రకాశం నగర్:** జేసీఐ రాజమండ్రి చాంపియన్ టీమ్ సభ్యులు శనివారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘంలో ధాన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి జేసీఐ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇషాన్ అగర్వాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్టు రోగులకు, వృద్ధులకు అల్పాహారం అందజేశారు. వారికి టూత్ పేస్టులు, బ్రష్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు, కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షురాలు వట్టికూటి జాహ్నవి, సెక్రటరీ పీసపాటి వెంకట సత్యనారాయణమూర్తి ,కోశాధికారి మధుబాబు పాల్గొన్నారు.

### పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు



ఇన్నీసుపేట పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులను ముందస్తుగా సిద్ధం చేసుకుని నివేదిక అందజేయాలని బీఎల్‌వోలను రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ఆదేశించారు. ఆయన శనివారం ఇన్నీసుపేటలోని 155, టి.నగర్ హిందూసమాజ్ భవనంలోని 142 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ తేజ్ భరత్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించే క్రమంలో పోలింగ్ స్టేషన్లలో అన్ని ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేస్తున్నామన్నారు. పోలింగ్ స్టేషన్‌లో వివరాలు స్పష్టంగా కనిపించేలా బూత్ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెం జిల్లా ప్లానింగ్ అధికారి కోటయ్య, బీఎల్‌వోలు ఈ.సౌజన్య, కె.రంజిత్ కుమార్ ఉన్నారు.

### ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచారం

**రాజానగరం:** మండలంలోని కొండగుంటూరు, తోకాడ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీకి చెందిన నేతలను, కార్యకర్తలతో కలిసి ప్రతి ఒక్కరితో మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని కోరారు. పలుచోట్ల ఆయనకు ప్రజలు అభిమానంతో హారతులు ఇచ్చారు.

### ఏరువాక శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

**రాజానగరం:** జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకటనరసింహరావు, పి.అమ్మాజీ, ఎస్.హేమజ్యోతి చేసిన కృషి అభినందనీయమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.విజయానందన్ అన్నారు. దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన ఆ కేంద్రం పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సత్కరించి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో మార్టేరు పరిశోధన స్థానం అధిపతి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### శ్రీలక్ష్మీ హ్యుందాయ్ ఎక్స్ఛేంజ్, లోన్‌మేళా



జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** స్థానిక జేఎన్ రోడ్డులోని ఐరన్ హిల్‌కు ఎదురుగా ఉన్న మైదానంలో శనివారం శ్రీలక్ష్మీ హ్యుందాయ్ ఆధ్వర్యంలో మెగా ఎక్స్ఛేంజ్, లోన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (క్రెడిట్) కోరంగి శ్రీనివాసరావు ప్రారంభించారు. లక్ష్మీ హ్యుందాయ్ రాజమండ్రి గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎక్స్ఛేంజ్, లోన్‌మేళాలో భారీ డిస్కౌంట్‌తో పాటు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తున్నామన్నారు. కొత్తకారు కొనుగోలుకు రూ.2 లక్షల వరకూ డిస్కౌంట్ ఉందన్నారు. ఈ మేళాలో కొత్త కారు బుక్కింగ్ చేసిన ప్రతి కస్టమర్‌కు 2 గ్రాముల బంగారం కాయిన్ అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి పాత కారు వాల్యుయేషన్‌కు, కొత్త కారు టెస్ట్ డ్రైవ్‌కు కూడా బహుమతులు ఉన్నాయన్నారు. ఉచిత సర్వీస్ చెకప్, వాటర్ వాష్ కూపన్లు కూడా అందిస్తున్నామన్నారు. ఇవికాక స్పాట్ ఫైనాన్స్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఎక్స్ఛేంజ్, లోన్‌మేళా ఆదివారం కూడా కొనసాగుతుందని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.